క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 14న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కేయూసీ సబ్ స్టేషన్, పెద్దమ్మగడ్డ, వడ్డేపల్లి, ఆర్ఈసీ, మడికొండ, రాంపూర్, కడిపికొండ, సోమిడి, వెస్ట్‌సిటీ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అశోక కాలనీ, పోచమ్మ దేవాలయం, విద్యానగర్, గోకుల్‌నగర్, వాజ్‌పేయి కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, బ్రాహ్మణవాడ, మచిలీబజార్, పింజర్ల, ప్రశాంతి ఆస్పత్రి, కమ్యూనిటీ హాల్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ కోత విధించనున్నట్లు తెలిపారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. దేశాయిపేట, ఆరెపల్లి, ఆజంజాహి మిల్స్, స్టేషన్ రోడ్డు, ఖిలా వరంగల్, ఉర్సు సబ్ స్టేషన్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సుగుట్ట మెడికేర్ జనరల్ ఆస్పత్రిలో గుడ్ సామరిటన్ క్లబ్, ఈఐబీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ చైర్మన్ గాదె స్వరూప్‌రెడ్డి తెలిపారు. రక్తదాత దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న శిబిరంలో ప్రైవేట్ విద్యాసంస్థల బస్సుల ఓనర్లు, డ్రైవర్లు, క్లీనర్లు, విద్యార్థులు పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట అర్బన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల వరంగల్ వెస్ట్‌లో 2025 – 26వ విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ గోలి శ్రీలత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ (ఎంపీసీ, ఎంసీసీఎస్), బీఎస్సీ (బీజెడ్సీ, ఎంజెడ్సీ), బీకామ్(జనరల్ అండ్ కంప్యూటర్స్), బీఏ (హెచ్ఈపీ) కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇంటర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థినులు ఈనెల 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 79950 10676, 91772 61514 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం



ఖిలా వరంగల్: సర్వేతో భూ తగాదాలు పరిష్కారమవుతాయని కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టం అమలులో భాగంగా శుక్రవారం ఖిలా వరంగల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రభుత్వ సర్వేయర్స్ కోఆర్డినేటర్ ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో జూనియర్ సర్వేయర్లతో ఫీల్డ్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణ తీసుకున్న సర్వేయర్లు సేవా దృక్పథంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నరేష్, బోగి సురేష్, ప్రభాకర్, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

కాజీపేట రైల్వే ఏడీఈఎన్‌గా సంతోష్‌కుమార్

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఏడీఈఎన్‌గా సంతోష్‌కుమార్ రాజ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కాజీపేట ఏడీఈఎన్‌గా పనిచేస్తున్న ఎంఆర్‌కే.రాజు.. నాందేడ్ డివిజన్ ఆకోలకు బదిలీపై వెళ్లారు. మంచిర్యాల ఏడీఈఎన్‌గా పనిచేస్తున్న సంతోష్‌కుమార్‌ను సికింద్రాబాద్ రైల్వే అధికారులు బదిలీపై కాజీపేటకు పంపించారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన సంతోష్‌కుమార్ రాజ్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం



ఖిలా వరంగల్: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు అన్నారు. వరంగల్ 39వ డివిజన్ విద్యానగర్, సాకరాశికుంటలో రూ.60 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ నగరాన్ని అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల నవీన్‌రాజ్, మీసాల ప్రకాశ్, వేణు, కొడెం శివకుమార్, బాసాని శ్రీనివాస్, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే హెల్ప్‌లైన్ @ 139

● రైల్వే సేవలకు రైల్ మదద్ యాప్



కాజీపేట జంక్షన్‌లో ఏర్పాటు చేసిన పోస్టర్

కాజీపేట రూరల్: భారతీయ అతిపెద్ద సేవా రంగమైన రైల్వే శాఖ.. మారుతున్న సాంకేతిక విప్లవానికి అనుగుణంగా ప్రయాణికులకు అప్‌డేట్‌గా సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తోంది. ఈ క్రమంలో రైల్ మదద్ –139 ఆల్ ఇన్ వన్ హెల్ప్ లైన్ నంబర్, యాప్‌ను ప్రవేశపెట్టింది. రైల్‌లో, రైల్వేస్టేషన్‌లో, ప్లాట్‌ఫాంపై, ఇతర రైల్వే ప్రాంతాల్లో ఎక్కడైనా, ఎప్పుడైనా, ఎలాంటి సహాయం కోసమైనా 139 నంబర్‌కు కాల్ చేసి నివృత్తి చేసుకోవచ్చు. అందుకోసం ఇండియన్ రైల్వే అధికారులు డయల్ 139, యాప్ ఉపయోగంపై అన్ని రైల్వే స్టేషన్లలో ప్రచారం చేస్తున్నారు.

డయల్ –139, యాప్ ఉపయోగం

ప్రయాణికులు భద్రత, వైద్య సహాయం, ప్రమాదంలో చేయూత, రైళ్లపై ఫిర్యాదులు, స్టేషన్‌లో ఫిర్యాదు, నిఘా సమాచారం, సరుకు రవాణా, పార్సిల్ సమాచారం, వ్యక్తిగత వివరాలు, సాధారణ విచారణకు డయల్ 139, యాప్ ద్వారా సమాచారాన్ని ప్రయాణికులు పొందవచ్చు.

తప్పిపోయిన వ్యక్తి అప్పగింత

రైల్ మదద్ 139 నంబర్‌కు వచ్చిన ఫిర్యాదు మేరకు ఇటీవల తప్పిపోయిన ప్రయాణికుడిని కాజీపేట జీఆర్పీ పోలీసులు అప్పగించారు. రాయ్‌పూర్ నుంచి గోవా టూర్‌కు వెళ్లేందుకు వాస్కోడిగామా రైల్‌లో ఒక బృందం సభ్యులు ప్రయాణిస్తున్నారు. మార్గమధ్యలో ఘన్‌పూర్‌లో రైలు ఆగగా కృష్ణపటేల్ అనే ప్రయాణికులు రైలు దిగి, ఎక్కేలోపు ఆ రైలు కదిలింది. దీంతో బృందంలోని రమేష్‌కుమార్ అనే వ్యక్తి 139 నంబర్‌కు కాల్‌చేసి ఫిర్యాదు చేశాడు. వెంటనే రైల్వే పోలీస్ యంత్రాంగం అప్రమత్తమై ఘన్‌పూర్‌లో తప్పిపోయిన కృష్ణపటేల్‌ను గుర్తించి కాజీపేట జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌కు తరలించి బృందం సభ్యులకు అప్పగించింది.

139 నంబర్‌ను వినియోగించుకోవాలి



రైల్వే శాఖ ప్రవేశపెట్టిన రైల్ మదద్ డయల్ 139 నంబర్‌ను ప్రయాణికులు వినియోగించుకోవాలి. రైల్వే స్టేషన్లలో, రైళ్లలో, ఇతర రైల్వే ప్రదేశాల్లో ప్రయాణికులు తమకు కావాల్సిన సమాచారాన్ని ఫోన్‌చేసి పొందవచ్చు. అవసరం, ఆపద, ఇతరత్రా రక్షణ కోసం డయల్ 139, యాప్ 24 గంటల పాటు అందుబాటులో ఉంటుంది.

– సి.చటర్జీ, ఆర్పీఎఫ్ సీఐ, కాజీపేట

ఔట్‌సోర్సింగ్ పోస్టుల్లో ప్రాధాన్యం ఇవ్వాలి



వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

హన్మకొండ: వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో పనిచేస్తున్న కార్మికులకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో ప్రాధాన్యం కల్పించాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. పరిశోధన స్థానంలో పనిచేస్తున్న వారిని కాకుండా ఇతరులను ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా మ్యాన్‌పవర్ ఏజెన్సీ నియమించడాన్ని నిరసిస్తూ కార్మికులు గురువారం నుంచి సమ్మె చేస్తున్నారు. సమ్మెలో భాగంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడి కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాగుల రమేష్ మాట్లాడుతూ 20 ఏళ్ల నుంచి వరంగల్ ప్రాంతీయ పరిశోధన స్థానంలో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారిని కాదని, 20 మంది బయట వ్యక్తుల నుంచి డబ్బులు తీసుకొని ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ కాంట్రాక్టర్ మహేష్.. సదరు పోస్టులను భర్తీ చేశాడని అన్నారు. వెంటనే వారిని తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఏడీఆర్ ఉమారెడ్డితో చర్చలు

ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులను సహపరిశోధన సంచాలకుడు ఆర్.ఉమారెడ్డి చర్చలకు ఆహ్వానించారు. మంగళవారం వరకు సమస్యను పరిష్కరిస్తానని, ఔట్ సోర్సింగ్ నియామకాలపై విచారణ జరిపి ప్రస్తుతం పనిచేస్తున్న వారికి న్యాయం జరిగే విధంగా చూస్తానని, ఈక్రమంలో ఆందోళన విరమించాలని కోరారు. దీంతో తాత్కాలికంగా సమ్మెను విరమించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రఘు, నమసాని రమాదేవి, గొల్ల సునీత, లింగయ్య, బాలు, ముంజ మంజుల, సరిత, ఎస్.సులోచన, లింగం, లలితతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

ప్రైవేట్ బడుల్లో పుస్తకాల విక్రయం నిషేధం



మడికొండలోని ఏకశిల స్కూల్ పుస్తకాల గదిని సీజ్ చేసిన ఎంఈఓ మనోజ్ కుమార్

కాజీపేట: ప్రైవేట్ బడుల్లో పుస్తకాలు, ఇతర స్టేషనరీ విక్రయం నిషేధమని కాజీపేట మండల విద్యాశాఖ అధికారి బండారి మనోజ్ కుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని ప్రైవేట్ పాఠశాలలను శుక్రవారం తనిఖీ చేశారు. మడికొండలోని ఏకశిల స్కూల్‌ను సందర్శించి, పుస్తకాలు అమ్ముతున్నట్లు గుర్తించి ఆ గదికి తాళం వేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, నోట్‌బుక్స్, బ్యాగులు, యూనిఫాం, టైబెల్టులు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయొద్దని ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలకు సూచించారు. స్కూళ్లలో ఇబ్బందులు ఎదురైతే ఎంఈఓ కార్యాలయంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

వరంగల్ చౌరస్తా: వ్యక్తిగత, ఇంటితోపాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవని బల్దియా సీఎంహెచ్ఓ రాజారెడ్డి అన్నారు. 100 రోజుల కార్యక్రమంలో భాగంగా వరంగల్ 27వ డివిజన్‌లోని స్టేషన్ రోడ్డులో స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన శుక్రవారం సమావేశంలో సీఎంహెచ్ఓ మాట్లాడారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. స్థానిక కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని రక్షించడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర గొప్పదని కొనియాడారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ రాజేష్, ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌రాజ్, చింతాకుల సునీల్ కుమార్, బాషపాక సదానందం, చేలుకల రాజు, ఐలోని రాజు, ఏనుగ శైలజ, చెమ్మల సాగర్, శానిటరీ జవాన్లు, కార్మికులు పాల్గొన్నారు.

ఖబ్రస్థాన్ స్థలాన్ని ఆక్రమిస్తే ఊరుకోం



నిరసన తెలుపుతున్న ముస్లిం నాయకులు

న్యూశాయంపేట: హనుమకొండ పట్టణ కేంద్రంలోని ఏనుగుల గడ్డ వద్ద ఖబ్రస్థాన్ స్థలాన్ని ప్రభుత్వం ఆక్రమించి, దానిలో బస్‌షెల్టర్ నిర్మించాలని చూస్తోందని మైనార్టీ ఐక్య సంఘాల నాయకులు ఆరోపించారు. ఆ స్థలాన్ని ఆక్రమిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. శుక్రవారం నమాజ్ అనంతరం హనుమకొండ చౌరస్తా నుంచి ఏనుగుల గడ్డ ఖబ్రస్థాన్ స్థలం వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని ఖబ్రస్థాన్ స్థలంలో ఎలాంటి నిర్మాణం చేపట్టకుండా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. నిరసన కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ చైర్మన్ బాబా ఖాదర్‌అలీ, మాజీ డిప్యూటీ మేయర్ సిరాజుద్దీన్, జుబేర్ ఘపూరీ, బీఆర్ఎస్ నాయకులు నయీమొద్దీన్, అస్లాం, సయ్యద్ ఆరిఫ్, ఖలీల్‌అహ్మద్, తౌసిఫ్, మొయిన్, అజార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తిరునహరి శేషు

కేయూ క్యాంపస్: ఈ విద్యాసంవత్సరం నుంచి అయినా ఇంజనీరింగ్, ఇతర ప్రొఫెషనల్ కోర్సులు చదువుతున్న బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ మేరకు మొదటి విద్యా సంవత్సరంలో బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేదన్నారు. కనీసం ఈ విద్యాసంవత్సరం నుంచైనా ఇంజనీరింగ్ చదివే బీసీ విద్యార్థులకు ర్యాంకుతో సంబంధం లేకుండా పూర్తి ఫీజులను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ జేఏసీ బాధ్యులు అలుగోజు శ్రీలత, సునీత, సతీష్, శ్రీనివాస్, నాగయ్య, ఎర్రబొజ్జు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమమే టీడబ్ల్యూజేఎఫ్ లక్ష్యం



మహాసభలో మాట్లాడుతున్న సోమయ్య

నయీంనగర్: జర్నలిస్టుల సంక్షేమమే తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) లక్ష్యమని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం అనేక పోరాటాలు నిర్వహించి, ఎన్నో విజయాలను సాధించినట్లు తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో టీడబ్ల్యూజేఎఫ్ తృతీయ జిల్లా మహాసభ.. టివి.రాజు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులకు గత ప్రభుత్వం చేసిందేమీ లేదని, అనేక సౌకర్యాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన ప్రస్తుత ప్రభుత్వం కూడా జర్నలిస్టులకు మొండిచేయి చూపిందని ఎద్దేవాచేశారు. కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి ఆనందం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొక్క దయాసాగర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి విజయ్ కుమార్, వల్లాల జగన్, ఇ.చంద్రశేఖర్, బాబురావు, అంతడుపుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీడబ్ల్యూజేఎఫ్ నూతన కార్యవర్గం

టీడబ్ల్యూజేఎఫ్ హనుమకొండ జిల్లా కార్యవర్గాన్ని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా టీవీ రాజు, ప్రధాన కార్యదర్శిగా అంతడుపుల శ్రీనివాస్, కోశాధికారి ఈసంపెల్లి రమేష్, ఉపాధ్యక్షుడిగా దామెర రాజేందర్, సంయుక్త కార్యదర్శి మండ రాజేష్, ఈర్ల తిలక్‌ను మహాసభ ఎన్నుకుంది. కార్యవర్గ సభ్యులుగా కొండ్రు దయాకర్, ఎల్లంకి జగపతిరావు, మరుపట్ల శంకర్, కె.ప్రవీణ్, డి.రవీందర్, రవికుమార్, ఎంఎస్ రావు, సయ్యద్ అలీ, బొల్లపల్లి రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎఫ్‌సీఐలో బీకేఎన్‌కే ప్రచారం

కాజీపేట: కాజీపేట భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) డివిజన్ మేనేజర్ ప్రఖార్ వర్మను శుక్రవారం రాత్రి ఎస్సీ, ఎస్టీ బీకేఎన్‌కే యూనియన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సంఘం ఎన్నికల ప్రచారంలో భాగంగా కాజీపేట ఎఫ్‌సీఐకి వచ్చిన సౌత్ జోన్ అధ్యక్ష, కార్యదర్శులు ముత్తయ్య, త్యాగరాజన్ ఆధ్వర్యంలో డీవీఎంను పలువురు సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా యూనియన్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో బీకేఎన్‌కే యూనియన్ గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను సభ్యులకు నాయకులు వివరించారు. అందుకోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐతరాజు, కీర్తి దాస్, జగదీశ్, హరికిషన్, దీపిక, సిద్ధార్థ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సఖి సేవలను వినియోగించుకోవాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హైమావతి, మహిళలు

కాజీపేట అర్బన్: బాధిత మహిళలు, బాలికలు సఖి సేవలను వినియోగించుకోవాలని సఖి అడ్మిన్ హైమావతి సూచించారు. సఖి సేవల కోసం టోల్‌ఫ్రీ నంబర్ 181కు కాల్ చేయాలని చెప్పారు. హనుమకొండ ఎక్సైజ్‌కాలనీలోని సఖి వన్‌స్టాప్ సెంటర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాధిత మహిళలకు ఉచిత కౌన్సెలింగ్, న్యాయ, వైద్య, పోలీస్ సహాయం, తాత్కాలిక వసతి కల్పించనున్నట్లు వివరించారు. సఖి సేవలకు చైల్డ్‌లైన్ 1098, 0870 – 2452112, 73829 83088 నంబర్లలో సంప్రదించాలని కోరారు. మహిళా చట్టాలపై అతివలు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. అనంతరం 181 వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సఖి సిబ్బంది శ్రీదేవి, పావని, అనూష, భారతి, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

ఎంజీఎం: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో భాగంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రావాల్సిన మే –2025 నెల వేతనంతో పాటు పెండింగ్‌లో ఉన్న 7 నెలల పీఆర్‌సీ, ఏరియర్స్‌ను వెంటనే చెల్లించాలని ఏఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్, జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉద్యోగులతో కలిసి హనుమకొండ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్యకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేష్ ఖన్నా మాట్లాడుతూ ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డులు, హెల్త్ ఇన్సూరెన్స్ ఉద్యోగితో పాటు కుటుంబ సభ్యులందరికీ వర్తించే విధంగా ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. అలాగే, మహిళా ఉద్యోగులకు వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని, ప్రతినెలా 1వ తేదీన వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆచంటి అభిషేక్ పాల్గొన్నారు.

పలువురికి సన్మానం



వరంగల్: ఇన్‌స్పెక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు

వరంగల్: వరంగల్ కమిషనరేట్ ఈస్ట్ జోన్ పరిధిలోని ఏనుమాముల పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సురేష్‌ను 14వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

టీపీసీసీ ఉపాధ్యక్షుడికి..

వరంగల్: ఇటీవల టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమితులైన నమిండ్ల శ్రీనివాస్‌ను 14వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సోషల్ మీడియా మాజీ రాష్ట్ర కోఆర్డినేటర్ అడుప మహేష్, నాయకులు పులిచేరి రాధాకృష్ణ, పస్తం శంకర్, సొరం చిన్ని, టి.శీను, కడెం కుమార్, పల్లకొండ చందు, సొరం ప్రభాకర్, అభిలాష్, సుధాకర్, కమలాకర్, ఏకాంబర చారి, తిరుపతి, ఎండీ.సంధాని, ఎండీ.యూసుఫ్, రాజు, ఎండీ.ఖాజా, రేహన్‌ఖాన్ పాల్గొన్నారు.

భద్రకాళి దేవస్థాన డైరెక్టర్‌కు..

రామన్నపేట: వరంగల్ భద్రకాళి దేవస్థాన డైరెక్టర్‌గా నియమితులైన తెలంగాణ రాష్ట్ర వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి, వరంగల్ వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు తోనుపునూరి వీరన్నను హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి శుక్రవారం సన్మానించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసం



మడికొండ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు



హసన్‌పర్తి: వంగపహాడ్ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసంలో ఉపాధ్యాయులు



కడిపికొండ ప్రైమరీ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులు



వరంగల్ రైల్వేగేట్ పెరకవాడలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాసం

సంక్షిప్తంగా

పోలీసుల అదుపులో నిందితుడు

కాజీపేట: డ్యూటీలో ఉన్న ఎస్కార్ట్ పోలీసుల కళ్లు కప్పి రెండు రోజుల క్రితం పరారైన నిందితుడిని కాజీపేట పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి కడిపికొండలో శుక్రవారం అరెస్ట్ చేశారు. కాజీపేట మండలం కడిపికొండ గ్రామానికి చెందిన కస్తూరి సాయికుమార్ ఇటీవలి కాలంలో పట్టణంలో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్నాడనే అనుమానంతో అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించగా తప్పును ఒప్పుకున్నాడు. కోర్టులో హాజరుపర్చడం కోసం ఎంజీఎం ఆస్పత్రికి వైద్యపరీక్షల నిమిత్తం తీసుకెళ్లగా, ఎస్కార్ట్ పోలీసులను ఏమర్చి సాయికుమార్ తప్పించుకున్నాడు. మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కాజీపేట పోలీసులు రెండు టీంలుగా విడిపోయి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టడంతో పాటు ఇంటిపై నిఘావేసి ఉంచారు. ఈ క్రమంలో ఇంటికి వచ్చిన సాయికుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

పలువురికి జరిమానా

రామన్నపేట: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 28 మందికి రూ.37,700 జరిమానా విధిస్తూ వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అబ్బోజు వెంకటేశం తీర్పు వెల్లడించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ తెలిపారు. అలాగే, లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడిన 9 మందికి రూ.3,900 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. వాహనాలు నడుపుతూ పట్టుబడిన 9 మంది మైనర్లపై జువైనల్ కోర్టులో చార్జ్‌షీట్ ఫైల్ చేయగా, మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు వారిని ఒకరోజు బాలల అబ్జర్వేషన్ హోమ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

మంత్రి వర్గంలో స్థానం కల్పించాలని నిరసన

న్యూశాయంపేట: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ముస్లింల ఓటు బ్యాంక్ ఎంతో సహకరించిందని, అధికారంలోకి వచ్చి 18నెలలు గడుస్తున్నా రాష్ట్రమంత్రి వర్గంలో ముస్లిం మైనార్టీలకు స్థానం కల్పించకపోవడం దారుణమని ముస్లిం మైనారిటీ సంఘాలు నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం నమాజ్ అనంతరం మసీదుల ఎదుట ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ముస్లింలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. తెలంగాణలో ముస్లింలు 14 శాతం ఉన్నారని, అయినా తమకు సరైన ప్రాధాన్యం కల్పించకపోవడం బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో అన్వర్, జమాల్ షరీఫ్, బాబా, హర్షద్ మున్నా, ఇస్మాయిల్, షకీల్, ముజాహిద్, ఆజాంఅలీ, చాంద్‌పాషా, ఆలంఖాన్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ గ్రాడ్యుయేషన్ డే

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ పిల్లల గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈమేరకు కొత్తగా చేరుతున్న పిల్లలకు స్వాగతం పలకడంతో పాటు విద్యాభ్యాసం ముగించుకుని వెళ్తున్న విద్యార్థులకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.కవిత, టీచర్లు బాలశ్రీ, శ్రీలత, కవిత, శ్రీదేవితో పాటు ఆయాలు పాల్గొన్నారు.

రక్తం దానంచేసి ప్రాణదాతలుగా నిలవాలి

మామునూరు: ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తం దానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని వాగ్దేవి విద్యాసంస్థల డైరెక్టర్ చందుపట్ల వాణిదేవి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జి.కమల్ యాదవ్ సూచించారు. ఈమేరకు ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుంచి 150 యూనిట్ల రక్తాన్ని రెడ్‌క్రాస్ వైద్యులు సేకరించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రకాశ్, తిరుపతిరావు, డాక్టర్ శశిధర్, సయ్యద్ ముస్తాక్, ఫిజికల్ డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

19న మంద కృష్ణమాదిగకు సన్మానం

నయీంనగర్: ఈనెల 19న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగను వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సన్మానించనున్నట్లు వీహెచ్‌పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం కాశీం తెలిపారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వికలాంగులకు రూ.4 వేల పెన్షన్ సాధించి పెట్టిన ఘనత మందకృష్ణకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బొట్ల సురేష్, గుమ్మడి రాజు, ప్రభాకర్, రాజు, వీరస్వామి, రాకేష్, సదానందం, రవి, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

22, 23వ తేదీల్లో కేవీపీఎస్ శిక్షణ తరగతులు

ఖిలా వరంగల్: ఈనెల 22, 23వ తేదీల్లో జరగనున్న కేవీపీఎస్ జిల్లాస్థాయి సామాజిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని కేవీపీఎస్ వరంగల్ జిల్లా కార్యదర్శి అరూరి కుమార్ పిలుపునిచ్చారు. వరంగల్ ఉర్సుగుట్ట రోడ్డులోని రామా సురేందర్ భవనంలో కేవీపీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉసిల్ల కుమార్ అధ్యక్షతన సామాజిక శిక్షణ తరగతుల కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ దళితులు, బడుగు బలహీన వర్గాలపై కుల దురహంకార హత్యలు, దాడులు కొనసాగుతూనే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కుల వివక్ష ఆధునిక పోకడలతో రోజురోజుకు కొత్త పుంతలు తొక్కుతోందని వాపోయారు. కార్యక్రమంలో కేవీపీఎస్ సహాయ కార్యదర్శులు ఆవుల ఉదయ్, మాదాసి దివ్య, మేకల లింగయ్య, వరుణ్‌కుమార్, కిట్టు పాల్గొన్నారు.

గ్రామదేవతకు జలాభిషేకం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం ముచ్చర్లలో గ్రామ దేవతకు శుక్రవారం జలాభిషేక నిర్వహించారు. బొడ్రాయి ప్రతిష్ఠించి వారం పూర్తైన సందర్భంగా తిరుగు వారాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బొడ్రాయి ప్రతిష్ఠాపన కమిటీ సభ్యులు ఇంద్రాసేనారెడ్డి, మనోహర్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, హరిప్రసాద్, శ్యామ్, శేషాచలం, పున్నం, యుగంధర్, సదానందం, దామెర సారయ్య తదితరులు పాల్గొన్నారు.

సహృదయ ఆశ్రమంలో అన్నదానం

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలోని సహృదయ అనాథ ఆశ్రమంలో కొట్టె హరీష్ జ్ఞాపకార్థం వృద్ధులకు స్నేహ జూనియర్ కళాశాల మిత్ర బృందం శుక్రవారం అన్నదానం చేసింది. గత నెలలో హరీష్ మృతి చెందడంతో మిత్రులు, కుటుంబ సభ్యులు కలిసి వృద్ధులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వృద్ధులతో కలిసి ఆడిపాడుతూ ఆత్మీయతను పంచారు. ఈ కార్యక్రమంలో కొట్టె అనసూయ, లలిత, రమేష్, ఇంద్ర, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కేయూ క్యాంపస్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏబీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని కోరారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలని సూచించారు. సమావేశంలో ఏబీఎస్ఎఫ్ నాయకులు కిరణ్, గోవింద్, సమ్మయ్య, సూర్య, సాయి తదితరులు పాల్గొన్నారు.